అనుమతి లేని సెల్లార్ సీజ్

సెల్లార్‌ను సీజ్ చేస్తున్న మున్సిపల్ అధికారులు

కామారెడ్డి, మార్చి 13 : పట్టణంలోని నిజాంసాగర్ చౌరస్తాలో ఉన్న కిసాన్ షాపింగ్ మాల్ సెల్లార్‌ను బుధవారం మున్సిపల్ కమిషనర్ సుజాత, అధికారులు పరిశీలించారు. షాపింగ్ మాల్‌లోని 5వ అంతస్థు, సెల్లార్‌ను అనుమతి లేకుండా నిర్మించారని మండల రెవెన్యూ అధికారి, పోలీసులు, మున్సిపల్ సిబ్బంది ఆధ్వర్యంలో హైకోర్టు ఆదేశాను సారం సీజ్ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సుజాత మాట్లాడుతూ.. పట్టణంలో ఎవరు కూడా అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టవద్దని సూచించారు. డిగ్రీ కళాశాల ఆవరణలో అనుమతిలేని షట్టర్లను సీజ్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ గిరిధర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జానయ్య, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

బోరు మోటారు ప్రారంభం

బోరుమోటారును ప్రారంభిస్తున్న నాయకులు

బాన్సువాడ రూరల్, మార్చి 13 : మండలంలోని బోర్లం క్యాంపులో నిర్మిస్తున్న పెద్దమ్మ దేవాలయం వద్ద నూతనంగా వేసిన బోరు మోటారును ముదిరాజ్ సంఘం పెద్దలతో కలిసి బీఆర్ఎస్ నాయకులు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెద్దమ్మ ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డిని ఎన్నికల ముందు కోరగా రూ.20లక్షలు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సాయికుమార్, ఏఎంసీ మాజీ చైర్మన్ నర్సింహులు, సొసైటీ మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు సాయిలు, మండల ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌గౌడ్, నాయకులు దొడ్ల వెంకట్రాంరెడ్డి, లక్ష్మణ్, శ్రీనివాస్, పర్వంరెడ్డి, సాయిలు, కాశీరాం, మోహన్, ముదిరాజ్ సంఘం పెద్దలు సంతోష్, రమేశ్, హన్మాండ్లు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

మాచారెడ్డి, మార్చి 13 : మండలంలోని రాజ్‌ఖాన్‌పేట గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు నౌసీలాల్‌నాయక్ బుధవారం ప్రారంభించారు. సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.10 లక్షలు కేటాయించిన ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీకి గ్రామస్తుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చంద్రం, మహేశ్‌నాయక్, సంజీవ్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు

కామారెడ్డి, మార్చి 13 : జిల్లా వ్యాప్తంగా ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ముగిశాయి. బుధవారం మొదటి సంవత్సర కెమిస్ట్రి, కామర్స్ పరీక్ష ఉదయం 9 నుంచి 12 గంటల వరకు జరిగాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 37 సెంటర్లలో పరీక్షలు నిర్వహించారు. మొత్తం జనరల్ 8,347 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 8,021 మంది హాజరయ్యారు. 326 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ 1,463 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 1,298 మంది హాజరయ్యారు. 165 మంది గైర్హాజరయ్యారని ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం తెలిపారు.

పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

మద్నూర్, మార్చి 13: మద్నూర్ జూనియర్ కాలేజీలోని పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ బుధవారం తనిఖీ చేశారు. మాస్ కాపీయింగ్ జరుగకుండా చూడాలని ఇన్విజిలేటర్లకు ఆదేశించారు. కేంద్రం వద్దకు ఇతరులు రాకుండా చూసుకోవాలన్నారు.

మద్నూర్‌లో పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

కారును ఢీకొన్న కంటైనర్

నలుగురికి గాయాలు

భిక్కనూరు, మార్చి 13 : మండలంలోని జంగంపల్లి ఆర్టీఏ చెక్ పోస్ట్ వద్ద ఓ కంటైనర్ కారును ఢీకొట్టడంతో బోల్తా పడిందని ఎస్సై సాయికుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్టీఏ చెక్‌పోస్ట్ వద్ద బుధవారం నిర్మల్ జిల్లా బైసాంకు చెందిన సయ్యద్ పర్వేజ్ నిర్మల్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తుండగా జంగంపల్లి చెక్‌పోస్ట్ వద్ద ఓ కంటైనర్ కారును వెనుకాల ఢీకొట్టడంతో బోల్తా పడగా అందులో ప్రయాణిస్తున్న నాలుగురికి స్వల్ప గాయాలు అయ్యాయని తెలిపారు. ఈ ప్రమాదానికి కారణమైన కంటైనర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు

మండలాభివృద్ధికి కృషి చేయాలి

నస్రుల్లాబాద్, మార్చి 13 : మండల కేంద్రంలోని సమీకృత మండల సముదాయ భవనంలో మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ విఠల్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఎంపీటీసీలు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. వ్యవసాయం, విద్యుత్, ఉపాధి హామీ, వైద్య ఆరోగ్య తదితర శాఖలపై ఎంపీపీ సమీక్ష నిర్వహించారు. మండల అభివృద్ధికి అధికారులు, ప్రజా ప్రతినిధులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్, జిల్లా కో-ఆప్షన్ సభ్యుడు మాజిద్, ఎంపీడీవో నీలావతి, ఎంపీవో రాము, వైస్ ఎంపీపీ ప్రభాకర్ రెడ్డి, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపీపీ విఠల్

పాఠశాలల తనిఖీ

దోమకొండ, మార్చి 13 : మండలంలోని లింగుపల్లి గ్రామంలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, ముత్యంపేట్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను విద్యాశాఖ అధికారి రాజు, అకాడమిక్ మానిటరింగ్ అధికారి వేణుశర్మ కలిసి బుధవారం ఉదయం ప్రార్థన సమయంలో తనిఖీ చేశారు. పాఠశాలలోని పలు రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థుల నోట్స్‌ను పరిశీలించారు. నోట్స్‌ను ఎప్పటికప్పుడు కరెక్షన్ చేయాలని ఆదేశించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తుల పరిశీలన

దరఖాస్తు చేసుకుంటున్న ప్రజలు

బీబీపేట్/బాన్సువాడ, మార్చి 13 : బీబీపేట్ మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలకు అర్హతలు ఉన్నా తమకు అందడం లేదని మండల ప్రజలు వాపోతున్నారు. మళ్లీ దరఖాస్తు చేసుకునేందుకు ప్రజాపాలన సేవా కేంద్రాలకు తరలి వస్తున్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సేవా కేంద్రాలకు పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి మళ్లీ దరఖాస్తు చేసుకుకోనేందుకు బారులు తీరుతున్నారు. ఈ విషయంపై స్థానిక ఎంపీడీవో పూర్ణ చంద్రోదయ కుమార్‌ను వివరణ కోరగా ఇప్పటి వరకు కరెంట్, గ్యాస్ పథకాలకు అర్హతలు ఉన్నా కొంత మందికి రాలేదన్నారు. ప్రజల నుంచి మళ్లీ దరఖాస్తులు తీసుకుని వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. బాన్సువాడలోని మున్సిపల్ కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తులను మున్సిపల్ సిబ్బంది బుధవారం పరిశీలించారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత

కామారెడ్డి, మార్చి 13 : తెలంగాణ రాష్ట్ర ఎన్‌జీసీలో భాగంగా బెస్ట్ ఫ్రం వేస్ట్ అనే అంశంపై బుధవారం జిల్లా కేంద్రంలోని భవిత పాఠశాలలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 60 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ రకాల ప్లాస్టిక్ వస్తువులను ఉపయోగించి విభిన్న కళాఖండాలను జీవితంలో ఉపయోగపడే వస్తువులను తయారు చేసి ప్రదర్శించారు. వీరిలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాల్వంచకు చెందిన గైడ్ టీచర్ సుశీల ఆధ్వర్యంలో 20 మందికి పైన జీవితంలో ఉపయోగపడే వస్తువులను తయారు చేశారు. మొదటి బహుమతి కింద రూ.3 వేలు, కేజీబీవీ తాడ్వాయికి చెందిన విద్యార్థులకు రూ.2 వేలు, వాణి విద్యాలయానికి తృతీయ బహుమతిగా వెయ్యి రూపాయలు అందజేశారు. గెలుపొందిన వారికి డీఈవో రాజు నగదు, బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి సిద్ధిరాంరెడ్డి, ప్రాజెక్ట్ ఆఫీసర్ విద్యాసాగర్, జ్యూరీ మెంబర్లు ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్, ఆయా పాఠశాలల గైడ్ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఎమ్మెల్యే

ఉపాధ్యాయురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

రాజంపేట్, మార్చి 13 : మండలంలోని ఆరెపల్లి తండా ప్రాథమిక పాఠశాలను కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి బుధవారం తనిఖీ చేశారు. పాఠశాలకు ఉపాధ్యాయుడు రాలేదు. తండా వాసులకు వేతనం చెల్లించి పెట్టుకున్న ఉపాధ్యాయురాలు ఉన్నారు. ఈ విషయమై ఉపాధ్యాయుడు ఐత బాలాజీని, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడిని, ఎంఈవోను వివరణ కోరారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

బీబీపేట్, మార్చి 13: మండలంలోని మాందాపూర్ గ్రామంలో రెడ్డి సంఘం-1లో పలు అభివృద్ధి పనులను సంఘం అధ్యక్షుడు చింతార్ల మోహన్‌రెడ్డి, కమిటీ సభ్యులు, నాయకులు కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అభివృద్ధి పనులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ ఎమ్మెల్సీ నిధుల నుంచి రూ.2 లక్షలు మంజూరు చేయడంతో పనులు ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు శివలింగు లింగారెడ్డి, పందిరి రాజిరెడ్డి, మోతె భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ శివలింగు లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచ్ చింతార్ల బాగారెడ్డి. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాజిరెడ్డి, సంఘం సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రూ.ఐదు లక్షలను మంజూరు చేయాలి

భిక్కనూరు, మార్చి 13 : మండలంలోని జంగంపల్లి గ్రామంలో ఉన్న మల్లు స్వరాజ్యం కాలనీలో నివాసం ఉంటున్న పేదలు ఇండ్లు నిర్మించుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి రూ.ఐదు లక్షలు మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక శాఖ జాతీయ ప్రధాన కార్యదర్శి వెంకట్ అన్నారు. మల్లు స్వరాజ్యం కాలనీలో నిర్మించిన ఇంటిని ఆయన ముఖ్య అతిథిగా హాజరై బుధవారం ప్రారంభించి మాట్లాడారు. ఎన్నో ఏండ్లుగా ఇక్కడే నివాసం ఉంటున్నారని, అప్పటి ప్రభుత్వాలు ఇండ్ల పట్టాలు ఇచ్చి స్థలాలు చూపించిందని తెలిపారు. వాటిలో గత రెండు సంవత్సరాలుగా వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఇండ్లను నిర్మించుకొని జీవనం కొనసాగిస్తున్నారని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించి నిధులు మంజూరు చేయాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకట్‌రాములు మాట్లాడుతూ.. ప్రభుత్వం చూపించిన స్థలంలో నివాసం ఉంటున్నారని వీరి జోలికి రావొద్దని, హైకోర్టు ఆర్డర్ ఉందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి పద్మ, సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్ గౌడ్, సీఐటీయూ జిల్లా నాయకుడు సురేశ్, జిల్లా కార్యదర్శి నర్సింహులు, మల్లు స్వరాజ్యం కాలనీ వాసులు పాల్గొన్నారు.

చెరువు కట్టపై వ్యక్తి హత్య

ఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ

పిట్లం, మార్చి 13: మండలకేంద్రంలోని మారేడు చెరువుకట్టపై బుధవారం ఓ వ్యక్తి హత్యకు గురైనట్లు ఎస్సై నీరేశ్ తెలిపారు. ఆయన తెలిపిన ప్రకారం.. చెరువుకట్టపై వ్యక్తి మృతదేహాన్ని బుధవారం ఉదయం గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుడు కారేగాం తండాకు చెందిన నునావత్ కిషన్(45)గా గుర్తించారు. అతడు గత మంగళవారం ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదని, మారేడు చెరువుకట్టపై హత్యకు గురైనట్లు గుర్తించారు. ఘటనా స్థలాన్ని బాన్సువాడ డీఎస్పీ టి.సత్యనారాయణ పరిశీలించారు. గుర్తు తెలియని వ్యక్తులు కిషన్ గొంతుకోసి ఆధారాలు లేకుండా మృతదేహాన్ని కాల్చేందుకు యత్నించారని మృతుడి సోదరుడు శ్రీనివాస్ తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. రూరల్ సీఐ పి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'అమ్మాయిగారు' నవల ఆవిష్కరణ

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 13: మండలంలోని సర్దల్‌పూర్ గ్రామానికి చెందిన యువకుడు నాయికోటి చందు రచించిన 'అమ్మాయిగారు' నవలను పలువురు కళాకారులు బుధవారం ఆవిష్కరించారు. రాకేట్ రాఘవ, తాగుబోతు రమేశ్, నూకరాజు, ఇమ్మాన్యుయేల్, వెంకీ నవల ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. తమ గ్రామ యువకుడు నవల రచించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తంచేశారు.

మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

చిల్లర్గిలో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో కమలాకర్

పిట్లం, మార్చి 13: మండలంలోని నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో కమలాకర్ అన్నారు. ఆయన బుధవారం చిల్లర్గి గ్రామంలోని నర్సరీ, ఆరోగ్య ఉప కేంద్రం, గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని పరిశీలించారు. వంద శాతం ఇంటి పన్ను వసూలు చేయాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. వైస్ ఎంపీపీ లక్ష్మారెడ్డి, ఎంపీవో బ్రహ్మం, ఏపీవో శివకుమార్ తదితరులు ఉన్నారు.

ఈజీఎస్ పనుల పరిశీలన

రామారెడ్డి, మార్చి 13: మండలంలోని గిద్ద గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో కూలీలు చేపడుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఎంపీడీవో సవితారెడ్డి బుధవారం పరిశీలించారు. కొలతల ప్రకారం పనులు చేపట్టాలని కూలీలకు సూచించారు. కూలీల హాజరు శాతం పెంచేలా చూడాలని, ఎండలు తీవ్రమవుతున్న నేపథ్యంలో కూలీలు వెంట తాగునీటిని తెచ్చుకోవాలన్నారు. ఏపీవో ధర్మారెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్యను పెంచాలి

డీఆర్డీవో చందర్‌నాయక్

బిచ్కుంద, మార్చి 13: ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్యను పెంచాలని డీఆర్డీవో చందర్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ఐదు మండలాల ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఉపాధి హామీ సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన.. ఉపాధి హామీలో చేపట్టిన పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. యాప్ ద్వారా తప్పనిసరిగా ఉపాధి కూలీల హాజరును రెండు పర్యాయాలు తీసుకోవాలని సూచించారు. అనంతరం గోపన్‌పల్లిలోని నర్సరీని పరిశీలించారు.

నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న డీఆర్డీవో చందర్‌నాయక్

ఎస్సెస్సీ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో దేవీసింగ్

నిజాంసాగర్, మార్చి13: విద్యార్థులు ఇష్టపడి పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలంటూ మండల విద్యాశాఖ అధికారి దేవిసింగ్ పిలుపునిచ్చారు. బుధవారం మహ్మద్‌నగర్ మండలంలోని కొమలంచ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి విద్యార్థులకు ఆత్మీయ వీడ్కోలు సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని కష్టపడి చదివి చేరుకోవాలని సూచించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కాంప్లెక్స్ హెచ్ఎం అమర్‌సింగ్, హెచ్ఎం బాలచందర్, ఉపాధ్యాయులు శ్రీరాం, నర్సింహులు, సాయిలు, మీరాన్, నాగరాజు శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మి, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వీడ్కోలు..

మహ్మద్‌నగర్ జడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి విద్యార్థులకు బుధవారం వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. పాఠశాలతో తమ అనుభూతులను విద్యార్థులు నెమరు వేసుకున్నారు. తోటి మిత్రులను వీడిపోతున్నందుకు కన్నీటి పర్యంతమయ్యారు. హెచ్ఎం మధుసూదన్‌రాజు మాట్లాడుతూ.. విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

బస్వన్న ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

డోంగ్లీ, మార్చి 13: మండలంలోని సిర్పూర్ గ్రామంలో ఉన్న బస్వన్న ఆలయంలో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయనను గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో న్యాయవాది రాజుపాటిల్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు దీన్‌దయాల్, శివానంద్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక..

నిజాంసాగర్, మార్చి13: ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు సమక్షంలో ఇతర పార్టీలకు చెందిన పలువురు మాజీ సర్పంచులు, నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. జుక్కల్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ కోసం కష్టపడిన వారికి తగిన ప్రాధాన్యత ఉంటుందని అన్నారు.

ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

అంబేద్కర్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా బబ్లూ

ఎల్లారెడ్డి, మార్చి 13: తెలంగాణ అంబేద్కర్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా మండలంలోని గండిమాసానిపేట్‌కు చెందిన బబ్లూ నియమితులయ్యాడు. కామారెడ్డిలోని కళాభారతిలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆలిండియా అంబేద్కర్ సంఘం ఫౌండర్ రాజు ఆధ్వర్యంలో జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బబ్లూ మాట్లాడుతూ.. తనను ఉపాధ్యక్షుడిగా నియమించినందుకు ధన్యవాదాలు తెలిపారు.

వేతనాలు మంజూరు చేయాలని నిరసన

నిరసన వ్యక్తంచేస్తున్న ఉపాధ్యాయులు

సదాశివనగర్, మార్చి 13: తమకు వేతనాలు మంజూరు చేయాలని కోరుతూ సదాశివనగర్‌లోని మోడల్ పాఠశాల ఉపాధ్యాయులు బుధవారం నిరసన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో తమకు వేతనాలు సకాలంలో అందుతాయని భావించినా.. నిరాశే మిగులుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. 010 పద్దు కింద ప్రతినెలా ఒకటో తేదీన వేతనాలు మంజూరు చేయాలని ఉపాధ్యాయుడు రాజశేఖర్ తదితరులు ప్రభుత్వాన్ని కోరారు.

ప్రభుత్వ పథకాలపై ప్రజాభిప్రాయ సేకరణ

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 13: కేంద్ర ప్రభుత్వ పథకాలపై ఎల్లారెడ్డి పట్టణంలో ప్రజాభిప్రాయ సేకరణను బీజేపీ మండల అధ్యక్షుడు పెద్దెడ్ల సర్సింహులు అధ్వర్యంలో బుధవారం చేపట్టారు. నియోజకవర్గ అభివృద్ధికి చేపట్టాల్సిన పనులపై అభిప్రాయాలను సేకరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మర్రి బాల్‌కిషన్, దేవేందర్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

నిజాంసాగర్, మార్చి13: వేసవి కాలంలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎంపీడీవో గంగాధర్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో బుధవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. తాగునీటి సరఫరా కోసం ముందస్తు ప్రణాళికలు తయారు చేసుకోవాలని సూచించారు. వంద శాతం ఇంటి పన్ను వసూలు చేయాలన్నారు. పారిశుద్ధ్య పనులను నిత్యం పర్యవేక్షించాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీవో అబ్బాగౌడ్, ఏపీవో శ్రీనివాస్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షా ప్యాడ్‌లు పంపిణీ

పిట్లం/డోంగ్లీ, మార్చి 13: పిట్లం మండలంలోని చిల్లర్గి గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు లయన్స్ క్లబ్ సభ్యుడు కొంతం రాజు పరీక్షా ప్యాడ్‌లను బుధవారం పంపిణీ చేశారు. విద్యార్థులు పరీక్షలు బాగా రాసి మంచి మార్కులు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో పిట్లం లయన్స్ అధ్యక్షుడు కిషన్, హెచ్ఎం హరిసింగ్, సిబ్బంది పాల్గొన్నారు.

డోంగ్లీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పూర్వ విద్యార్థి బస్వరాజ్ పరీక్షా ప్యాడ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం టి.శ్రీనివాస్, ఉపాధ్యాయుడు సునీల్ పాల్గొన్నారు.

ప్రధాన రహదారిపై మురికి నీరు

డోంగ్లీ, మార్చి 13: డోంగ్లీలోని ప్రధాన రహదారిపై మురికి నీరు పారుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మురికి నీటిలో చెత్త వేస్తున్నారని, దీంతో దోమల బెడద పెరిగిందని సమీపంలో ఉంటున్న ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి మురికి నీరు రోడ్డుపై పారకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రోడ్డుపై పారుతున్న మురికినీరు

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

సదాశివనగర్, మార్చి 13: నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ రమాదేవి అన్నారు. తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి ఐకేపీ గ్రామ సంఘంలో కుప్రియల్, రంగంపేట్, పోసానిపేట్, మోషంపూర్, ఇస్రోజివాడి గ్రామాలకు చెందిన సీఏలు, సంఘ సభ్యులతో బుధవారం ఏర్పాటు చేసిన మహిళా దినోత్సవం సందర్భంగా బ్యాంక్ సిబ్బంది, డ్వాక్రా సంఘాల సభ్యులను సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామ మహిళలు బ్యాంక్ మేనేజర్, సిబ్బందికి శాలువాలు కప్పి సత్కరించారు. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో బ్యాంక్ అధికారులు వనమాల, హర్షిత, బాల్‌రాజు, ఐకేపీ సీఏలు వరలక్ష్మి, సునీత, శ్రీలత, గంగామణి, రేణుక, మానస, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

అధికారిణులను సన్మానిస్తున్న మహిళలు

108 అంబులెన్స్‌లో మహిళ ప్రసవం

గాంధారి, మార్చి 13: పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణిని 108 అంబులెన్స్‌లో దవాఖానకు తరలిస్తుండగా.. మార్గమధ్యంలో మగబిడ్డకు జన్మనిచ్చిన ఘటన మండలంలో చోటుచేసుకున్నది. మండలంలోని గుర్జాల్‌తండాకు చెందిన కృష్ణవేణికి బుధవారం తెల్లవారుజామున పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌లో బాన్సువాడ ప్రభుత్వ దవాఖానకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో మార్గమధ్యంలో మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని, వారిని బాన్సువాడ ప్రభుత్వ దవాఖానలో చేర్పించినట్లు 108 అంబులెన్స్ సిబ్బంది కమలాకర్, ప్రకాశ్‌గౌడ్ తెలిపారు. 108 సిబ్బందికి గర్భిణి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

శిశువును అప్పగిస్తున్న 108 సిబ్బంది